# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-04-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **వక్ఫ్ చట్ట సవరణ బిల్లు 2025పై ఈరోజు లోక్‌సభలో చర్చ కొనసాగుతోంది.**
2. **వేసవి దృష్ట్యా పశువులకు తాగునీటి సమస్య తలెత్తకుండా నీటి తొట్టెలను నిర్మించాలని ఉపముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు.**
3. **గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.**
4. **హంద్రీ నీవా ప్రాజెక్టుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యమిస్తోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**
5. **చిన్నారుల్లో మంద బుద్ధి నివారణపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈరోజు ప్రపంచ ఆటిజం అవగాహనా దినం నిర్వహిస్తున్నారు.**

==========================

పేద ముస్లింలు తమ హక్కులను పొందేందుకు వక్ఫ్ చట్ట సవరణ బిల్లు 2025 దోహదపడుతుందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. ఢిల్లీలో ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఒక చారిత్రాత్మక చొరవ అని చెప్పారు. వక్ఫ్ సవరణ బిల్లు ముస్లింల కోసమే కాక మొత్తం దేశ ప్రయోజనాలకు దోహదపడుతుందని కేంద్ర మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ..37 సెకన్లు

---------------------------

వేసవి దృష్ట్యా పశువులకు తాగునీటి సమస్య తలెత్తకుండా గ్రామాల్లో నీటి తొట్టెలను నిర్మించాలని ఉపముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల నిర్మించనున్న నీటితొట్టెలకు భూమి పూజ చేసిన నేపథ్యంలో ఆయన నిన్న సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా 56 కోట్ల రూపాయలతో నిర్మించనున్న 12 వేల 500 నీటితొట్టెలను ఈనెల 15లోపు పూర్తి చేయాలన్నారు. వీటి ద్వారా 25 లక్షల పశువులు, మూగజీవాలకు తాగునీరు అందుబాటులోకి రానుందని చెప్పారు. ఒక్కో నీటి తొట్టెకు 45 వేలు ఖర్చు చేయనున్నామని, పశువులు నీరు తాగేందుకు వీలుగా రెండు రకాల తొట్టెలను నిర్మించాలని పవన్‌కల్యాణ్ ఆదేశించారు.

---------------------------

గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గం దివాకరపల్లి గ్రామంలో రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ కంప్రెస్డ్ బయో గ్యాస్-సీబీజీ ప్లాంట్‌కు ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ..

..వాయిస్.. 27 సెకన్లు

---------------------------

రాయలసీమ జిల్లాలకు జీవనాడి అయిన హంద్రీ నీవా ప్రాజెక్టుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యమిస్తోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో హంద్రీనీవా ప్రాజెక్టు పనుల పురోగతిపై మంత్రి సంబంధిత అధికారులతో ఈరోజు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఏడాది బడ్జెట్‌లో అత్యధికంగా 3 వేల 243 కోట్ల రూపాయలు కేటాయించామన్నారు. జూన్ నెల నాటికి మొదటి దశ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

---------------------------

రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు నిర్దిష్ట కార్యచరణ ప్రణాళిక అమలు చేయనున్నామని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ముక్కామల గ్రామంలో పశువుల నీటి తొట్టెల నిర్మాణం పనులకు మంత్రి నిన్న శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్ .. 24 సెకన్లు

---------------------------

మహిళలు, చిన్నారులపై నేరాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. గత 8 నెలల వ్యవధిలో మహిళలు, చిన్నారులపై జరిగిన నేరాలకు సంబంధించి 97 కేసుల్లో దోషులకు కఠిన శిక్షలు అమలు పరచడం జరిగిందని చెప్పారు. 22 కేసుల్లో దోషులకు న్యాయస్థానాలు జీవిత ఖైదు విధించాయని చెప్పారు. 4 కేసుల్లో 25 ఏళ్లు, 17 కేసుల్లో 20 ఏళ్లు, 4 కేసుల్లో 10 ఏళ్లు, 50 కేసుల్లో 7 ఏళ్ల జైలుశిక్షలు పడ్డాయని పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలోని 26 జిల్లా ప్రధాన సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ నెల 4వ తేదీ నుంచి 'స్లాట్ బుకింగ్' విధానం అమల్లోకి రానుందని రాష్ట్ర రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ ఐజీ హరినాయణన్ తెలిపారు. మిగిలిన సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దశల వారీగా ఈ నెల చివరినాటికి ఈ విధానం అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ప్రతి రోజూ ఉదయం 10 గంటల 30 నిమిషాల నుంచి సాయంత్రం 5 గంటల 30 నిమిషాల మధ్య రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్‌లో పేర్కొన్న స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్లకు ముందస్తు అపాయింట్‌మెంట్ పొందవచ్చని తెలిపారు.

---------------------------

చిన్నారుల్లో మంద బుద్ధి నివారణపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈరోజు ప్రపంచ ఆటిజం అవగాహనా దినం నిర్వహిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి సర్వ ప్రతినిధి సభ చేసిన తీర్మానం మేరకు 2008వ సంవత్సరం నుండి ప్రతి ఏటా ఏప్రిల్ 2వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. ఒంటరిగా ఉండడానికి ఇష్టపడడం, సరిగా మాట్లాడలేకపోవడం వంటి లక్షణాలు కలిగి ఉన్న చిన్నారుల మానసిక స్థితిని ముందుగానే గుర్తించి వైద్యుల సలహా మేరకు చక్కని మానసిక శిక్షణ ఇవ్వడం ద్వారా వారిలో మార్పు తీసుకువచ్చేందుకు అవకాశం ఉంది.

---------------------------

ఆటిజంని.. చిన్నతనంలోనే గుర్తిస్తే సులువుగా నయం చేయవచ్చని తిరుపతి రుయా ఆసుపత్రి బాలల స్వస్థ్య చికిత్సా కేంద్రం వైద్యులు పవన్ తెలిపారు. ప్రపంచ ఆటిజం అవగాహనా దినం సందర్భంగా తిరుపతిలో ఈరోజు ఆటిజం అవగాహనా ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా బాలల స్వస్థ్య చికిత్సా కేంద్రం వైద్య సిబ్బంది, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, పాల్గొని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ పవన్ మాట్లాడుతూ..

వాయిస్ ...35 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో ఇటీవల జరిగిన మండల ప్రజాపరిషత్–ఎంపీపీ, జిల్లా పరిషత్ జడ్పీ ఉప ఎన్నికల్లో పని చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఆ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈరోజు సమావేశమవుతారు. ఈమేరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, బాపట్ల జిల్లాల్లోని 8 నియోజకవర్గాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు హాజరవుతారని ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి.

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా వ్యాయామ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే రాష్ట్ర వ్యాయామ విద్యా సాధారణ ఉమ్మడి ప్రవేశ పరీక్ష –ఏపీ పీఈసెట్ –2025 నోటిఫికేషన్‌ను విడుదల చేశామని సెట్ కన్వీనర్ ఆచార్య పాల్‌కుమార్ తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా జూన్ 7వ తేదీ లోపు దరఖాస్తులు పంపించాలని సూచించారు. వేయి రూపాయల అపరాధ రుసుంతో అదే నెల 11లోపు, రెండు వేల రూపాయల అపరాధ రుసుంతో 13లోపు ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. తప్పుల సవరణకు జూన్ 12 నుంచి 14 వరకు అవకాశం కల్పించామని వివరించారు. జూన్ 17 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

=====================